

వరద నిధులు.. కృష్ణార్పణం

- నదిలో నీరు తగ్గిన నెలల తర్వాత పనులు
- అవసరమైనవి వదిలేసి ఇష్టారీతిన పనులు
- కొరవడిన పర్యవేక్షణతో అనవసరపు పనులు
- జంగిల్ క్లియరెన్స్ పేరుతో తూతూమంత్రంగా
- కరకట్టకు ఇరువైపులా నీడనిచ్చే చెట్ల తొలగింపు

వరద పనులు అంటే వరదకి ముందో.. వరద సమయంలో అత్యవసరంగానో చేస్తారు. కానీ నీటిపారుదల శాఖ మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా చేస్తుంది. నిధులు ఉన్నాయి.. పనులు చేస్తున్నామన్నట్లు చేస్తున్నారే కానీ అవి అవసరమా.. వాటి వల్ల ఉపయోగమా అన్న విషయాలను పట్టించుకోవడంలేదు. వరద వచ్చిపోయిన నెలల తర్వాత వరద పనుల పేరుతో తూతూమంత్రంగా చేస్తోంది. పనికి రాని కంప చెట్లను తొలగించాల్సిందిపోయి కరకట్టకు ఇరు వైపులా నీడనిస్తున్న వృక్షాలను నేలకూల్చేస్తున్నారు. ఏ పని ఏ తరహాలో చెయ్యాలనే సూచనలు చేసే నాథుడేలేడు. ఆర్సీ విభాగంలో సిబ్బంది కొరత, ఉన్న సిబ్బంది, అధికారులు కొత్తగా బదిలీపై వచ్చిన వారు కావడంతో పనులపై పర్యవేక్షణ లోపించింది. ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌కు ఏది చేస్తే అదే పనిగా గాలికొదిలేశారు.




వల్లభాపురం స్లూయిజ్ దగ్గర్లో కరకట్ట రోడ్డుకు దూరంగా ఉన్న చెట్టును ఎక్స్‌కవేటర్‌తో విరిచేసిన చిత్రం

తెనాలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి ఇటీవల రికార్డు స్థాయిలో వచ్చిన వరదతో కరకట్ట అంచులకు నీరు చేరింది. మరికొన్నిచోట్ల పైనుంచి కూడా ప్రవహించింది. ఆ సమయంలో అత్యవసర మరమ్మతులకు ప్రభుత్వం కుడి, ఎడమ కరకట్టలకు రూ.48 లక్షలు కేటాయించింది. వరద వచ్చాక కేవలం ఇసుక మూటలు, అత్యవసరమనుకున్నచోట ఎక్స్‌కవేటర్లతో కట్టలు సరిచేశారు. మిగిలిన నిధులతో కరకట్టకు ఇరువైపులా పెరిగిన ముళ్ల కంపను తొలగించడం, పేరుకుపోయిన మట్టి, ఇసుకను వెలుపలకు నెట్టేయడం, చెత్త కుప్పలను తొలగించడం వంటి పనులు చెయ్యాలి. కరకట్ట అంచులు ఎక్కడైనా బలహీనంగా ఉంటే వాటిని మట్టితో బలపరిచే పనులు చెయ్యాలి. అయితే వరద సమయంలో ఇసుక మూటలువేసే పనులు చేసిన అధికారులు ఆ తర్వాత మిగిలిన నిధులతో పనులు చేశామనిపించే విధంగా తూతూమంత్రంగా చేయడం విశేషం. అసలు పనికి బదులు అనవసరపు పనులు చేయడంపై విమర్శలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.



ప్రాతూరు దగ్గర వేపచెట్టును అడ్డులేకున్నా వేర్లు కదిలిపోయి బయటకువచ్చేలా నేలపైకి నెట్టేసిన చిత్రం



చిర్రావూరు దగ్గర చిన్నపాటి కంపచెట్టు కూడా తొలగించలేని విధంగా మట్టితో సహా వదిలేసి, పైపైన గీరేసి వదిలేసిన చిత్రం

ముళ్లకంప వదిలేసి..

కృష్ణానదికి కుడి కరకట్టపై వారధి నుంచి మున్నంగి వరకు 20 కి.మీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్, కరకట్ట కోత, బలహీనపడటం వంటి చోట్ల మరమ్మతులు చెయ్యాలి. దీని కోసం రూ.9 లక్షల వరకు మంజూరు చేశారు. అయితే వరద సమయంలో పెదకొండూరు-వల్లభాపురం మధ్య కొన్నిచోట్ల మాత్రమే ఇసుక మూటలు వేశారు. వరద సమయంలో కంప తొలగింపు అవకాశమేలేదు. దీంతో వరద తర్వాత ఇప్పుడు ఈ పనులు చేపట్టారు. అయితే చేస్తున్న కొద్దిపనులు కూడా సంపూర్ణంగా చేయడంలేదు. రోడ్డుపైకి అడుగు వెడల్పులో మట్టిపేరుకుపోయి దానిపై కంప మొలచినా కనీసం దానిని కూడా తొలగించడంలేదు. కరకట్టకు ఇరువైపులా ఏడేళ్ల నుంచి పెంచుతున్న చెట్లను నేలకూల్చడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాతూరు, చిర్రావూరు, గొడవర్రు, అత్తలూరివారిపాలెం, వల్లభాపురం ప్రాంతాల్లో నీడనిచ్చే చెట్లను నేలకూల్చేశారు. అడ్డొచ్చిన కొమ్మలు కాకుండా కరకట్టకు మూడు నుంచి ఐదు అడుగుల దూరంలో ఉన్న చెట్లను కూడా వేళ్లతో తొలగిస్తున్నారు. దీనిపై ఆర్సీ విభాగం జేఈ విజయరాజును ప్రశ్నిస్తే చెట్లు కొట్టేయమని చెప్పలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. వరద పనులు అప్పట్లో అత్యవసరం అనుకున్నవి చేశామని, మిగిలిన పనులను ప్రస్తుతం చేస్తున్నామని చెప్పారు.

భయం భయంగా కరకట్ట

కరకట్టకు ఇరువైపులా ఇంగ్లీష్ తుమ్మ, ఇతర ముళ్ల పొదలు దట్టంగా అల్లుకుపోయాయి. కుడి కరకట్టకు వారధి నుంచి పెనుమూడి వరకు చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. వీటి కారణంగా వరద సహాయ చర్యలకి, కరకట్ట అత్యవసర పనులకు ఇబ్బందిపడాల్సి వచ్చింది. కరకట్ట ఆధునికీకరణ జరిగిన ప్రాంతంలోనే ఇలా ఉంటే, పనులు ఆగిపోయిన ప్రాంతంలో పరిస్థితి దారుణంగా ఉంది. వారధి దగ్గర కరకట్ట ప్రారంభమైన దగ్గర కొంతమేర విస్తరణ జరగలేదు. అయినా ఇక్కడ కంప చెట్ల సమస్య రాలేదు. విస్తరణ జరిగిన చిర్రావూరు-కొల్లిపర మధ్య మరింత దారుణంగా మారింది. దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర రోడ్డు అధ్వానంగా ఉంటే, కంప పెరిగి మరింత సమస్యగా మారింది. కరకట్ట ఆధునికీకరణకు ముందే పెదకొండూరు-వల్లభాపురం మధ్య డబుల్ రోడ్డు నిర్మాణం జరిగింది. దీంతో 4 కిలోమీటర్ల రోడ్డుపై ఆధునికీకరణ సమయంలో ఒక్క పని కూడా చెయ్యలేదు. దీంతో ఈ ప్రాంతంలో రెండు వైపులా ముళ్ల కంప కమ్మేసి, రోడ్డు కుచించుకుపోయింది. కొల్లిపర-చిలుమూరు మధ్య కొన్నిచోట్ల కంప పెరిగింది. కొల్లూరు-ఈపూరు, దోనేపూడి-వెల్లటూరు మధ్య రోడ్డు పనులు జరగలేదు. దీంతో కమ్మేసిన చెట్లను కూడా తొలగించే చర్యలు చేపట్టలేదు. ఈ ప్రాంతాల్లో మనిషి అడుగు పెట్టడం కూడా గగనమే. ఇటువంటి చోట్ల ఒక్కపని కూడా చెయ్యలేదు. జంగిల్ క్లియరెన్స్ అవసరం ఉన్నచోట కాకుండా కంపచెట్లు పెద్దగా లేనిచోట పనులు చేశామనిపించుకోవడం విశేషం.



ఆర్‌జేడీ కార్యాలయం.. ప్రక్షాళన

- దీర్ఘకాలంగా తిష్ఠేసిన ఉద్యోగుల బదిలీ
- ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్‌తో ఓ ఉద్యోగి పదేళ్లుగా విధులు
- అక్రమాలకు అండగా ఉన్న వారి స్థానచలనానికి కార్యాచరణ

గుంటూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాయం(ఆర్‌జేడీ)లో దీర్ఘకాలంగా తిష్టవేసి అక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కలిగించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే ఏడీ స్థాయిలో ఉన్న ఉద్యోగిని కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. మరో ఇద్దరు ఉద్యోగుల్ని కూడా బదిలీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. మిగిలిన సిబ్బందిని దశలవారీగా బదిలీ చేయాలని నిర్ణయించారు. గుంటూరు డీఈవో కార్యాలయ ఆవరణలోని ఆర్‌జేడీ పరిధిలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలోని హెచ్ఎం స్థాయి ఉపాధ్యాయులు, ఎంఈవోల సర్వీస్ రూల్స్, ప్రైవేటు స్కూల్స్ గుర్తింపు, బీఈడీ, డీఈడీ కళాశాల నిర్వహణ, పనితీరు, తనిఖీలు, ప్రైవేటు స్కూల్స్‌లో అదనపు తరగతులకు అనుమతులు తదితర విషయాలను ఆర్‌జేడీ కార్యాలయం పర్యవేక్షిస్తోంది. ఇప్పటి దాక ఇక్కడ పనిచేసిన అధికారుల మెతక వైఖరిని అడ్డం పెట్టుకుని ఉద్యోగులు చెలరేగిపోయారన్న విమర్శలున్నాయి. అక్రమ పద్ధతుల్లో సంవత్సరాల తరబడి ఇక్కడే తిష్ట వేసి సంపాదనలో మునిగిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల బాధ్యతలు చేపట్టిన కార్యాలయ అధికారి ఉద్యోగులపై అక్రమాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. కొన్ని విషయాల్లో ఆయన్ని సైతం తప్పుదోవపట్టించేందుకు ఉద్యోగులు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన కార్యాలయ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు సంఘాల నాయకులు చెబుతున్నారు.

- ఇక్కడ కీలకంగా పనిచేసే ఓ ఉద్యోగి ప్రకాశం జిల్లా నుంచి డిప్యూటేషన్‌పై వచ్చాడు. జిల్లాకు చెందిన ఓ సంఘం నేత నుంచి ఆఫీస్‌బేరర్ సర్టిఫికెట్ తీసుకువచ్చి దాదాపు పదేళ్ళుగా కార్యాలయంలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. వాస్తవానికి ప్రకాశం జిల్లాకు చెందిన ఈ ఉద్యోగికి గుంటూరు జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘ నాయకుడు ఇచ్చే ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్ ఉపయోగపడదు. అయితే అధికారుల్ని మాయచేసి ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతున్నాడు. కార్యాలయంలోని సెక్షన్లలో ఎవరి ఫైల్ ఎక్కడ ఉంది.. దాని స్థితి ఏమిటి.. పరిష్కారానికి ఎంత చెల్లించాలనేది ఈ ఉద్యోగి నిర్ణయిస్తాడని సమాచారం.
- ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన మరో ఇద్దరు ఉద్యోగులు దాదాపు ఐదేళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. కార్యాలయానికి పనుల కోసం వచ్చే వారిని విభాగాలకు తీసుకెళ్ళి బేరాలు కుదర్చడంలో వీరుదిట్ట అనే ఆరోపణలు ఉన్నాయి.
- కార్యాలయంలో సూపర్‌మెన్‌గా పేరున్న ఓ ఉద్యోగి దాదాపు ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఈ సూపర్‌మెన్ అక్రమాలు సూపర్‌గానే ఉంటాయన్న ఆరోపణలున్నాయి. ప్రతి ఫైలుకు రేటు పెట్టి వసూలు చేస్తాడని సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఎక్కువ కాలం ఇతర జిల్లాల్లో ఇన్‌చార్జీలుగా పనిచేశారు. దీంతో ఈ సూపర్‌మెన్ ఫైల్స్‌ను ఏకంగా అధికారి పనిచేసే వద్దకే తీసుకెళ్లి పరిష్కరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- డీఈడీ కళాశాల గుర్తింపు, రెన్యువల్‌లో హైదరాబాద్‌లో జరిగిన అక్రమ వసూళ్ల విషయంలో గుంటూరు ఆర్‌జేడీ కార్యాయలంలో పనిచేసిన ఓ అధికారి కీలకంగా ఉన్న విషయం తెలిసిందే. వినుకొండ ప్రాంతానికి చెందిన ఓ డీఈడీ కళాశాల యాజమానితో కలిసి అక్రమ వసూలు చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన సంఘటన అప్పట్లో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అధికారికి కర్త, కర్మ, క్రియగా పని చేసిన ఉద్యోగులు ఇప్పటికీ ఆర్‌జేడీ కార్యాలయంలో ఉన్నారు. ఇలా దాదాపు పది మందిపైగా ఉద్యోగులు నాలుగు నుంచి పదేళ్లకు పైగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఆయా ఉద్యోగులకు దశలవారీగా స్థాన చలనం కలిగించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

ఎందులో.. 'స్కిల్'

- వయసుల వారీగా సర్వే
- ఇప్పటికే యంత్రాంగానికి శిక్షణ పూర్తి
- క్లస్టర్ల వారీగా సచివాలయ ఉద్యోగులతో ప్రక్రియ
- ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కల్పన అనే ఊసే లేకుండా వైసీపీ ఐదేళ్ల పాలన సాగింది. దీంతో జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగింది. యువతలో ఉన్న స్కిల్‌కు పదును పెట్టి వారు కోరుకున్న రంగంలోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిని అమలు చేసే విధంగా కార్యాచరణను ప్రభుత్వం ప్రారంభించింది. ఇంటింటికి తిరిగి వయసుల వారీగా స్కిల్ గణన చేపట్టడంతో పాటు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే విధంగా ప్రణాళికలు రచించింది. ఈ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి తొలుత సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను అధికారులు చేపట్టారు. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కింద భారీగానే నిధులను ప్రభుత్వం కేటాయించింది. నైపుణ్య గణనలో భాగంగా ఇప్పటికే చదువు పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్న వారితో పాటు ప్రస్తుతం చదువుతున్న వారి వివరాలు కూడా యంత్రాంగం సేకరించనుంది. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులతో పాటు ప్రస్తుతం ఏ రంగంలో ఉపాధి పొందుతున్నారు.. దేనిలో రాణించాలని ఉంది లాంటి సమగ్ర వివరాలను సర్వేలో భాగంగా నమోదు చేయనున్నారు.



నైపుణ్య గణనకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం(ఫైల్ ఫొటో)

50 ఇళ్లు యూనిట్‌గా ఒక్కొక్కరికి ఖాతా కేటాయింపు

50 ఇళ్లను యూనిట్‌గా తీసుకుని సర్వే చేపట్టనున్నారు. ఆధార్ నంబరు ఆధారంగా వివరాలు నమోదు ప్రక్రియ ఉండడంతో పాటు మ్యాపింగ్ కూడా చేస్తారు. సర్వే పూర్తి కాగానే పోర్టల్‌లో నమోదైన ప్రతి ఒక్కరికీ ఒక్కో ఖాతా నంబరును కేటాయిస్తారు. దాని ఆధారంగా ఆ పోర్టల్‌లోకి వెళ్లి మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది. ఈ సర్వే మొత్తం సచివాలయ సిబ్బంది ద్వారానే జరగనుంది. ఇప్పటికే మండలానికి ఇద్దరి చొప్పున ఎంపిక చేసి కలెక్టరేట్‌లో స్కిల్ గణనపై శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మండలం యూనిట్‌గా అక్కడ సర్వేలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. మూడు మండలాలు మినహా శిక్షణ కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. 15-59 ఏళ్ల మధ్య వయస్కులను ఆరు కేటగిరీల్లో విభజించి నైపుణ్య గణన చేపట్టే విధంగా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. చదువు పూర్తయి ఉద్యోగ వేటలో ఉన్నవారికి అక్కడ నమోదు చేసిన వివరాల ఆధారంగా సదరు కంపెనీకి ఆమోదం ఉంటే శిక్షణ కూడా వారే ఇచ్చి ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. ఇది కాదనుకుంటే ప్రభుత్వమే సదరు కంపెనీలకు కావాల్సిన విధంగా తర్ఫీదునిచ్చి వారిని సిద్ధం చేయనున్నది.

భారీ సంఖ్యలోనే నమోదు....

వయసుల వారీగా చూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 15 నుంచి 17 ఏళ్ల మధ్య ఉన్నవారి సంఖ్య దాదాపు మూడు లక్షల వరకు ఉండే అవకాశం ఉంది. అదే విధంగా 18-19 ఏళ్ల మధ్య వయసు వారి సంఖ్య రెండు లక్షల వరకు, 20–29 మధ్య ఏడు లక్షల వరకు, 30–39 మధ్య 9 లక్షల వరకు, 40-49 మధ్య 8 లక్షల వరకు, 50–59 మధ్య 5 లక్షల వరకు వివరాలు పోర్టల్‌లో నమోదయ్యే అవకాశం ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. స్కిల్ సర్వే ఆధార్‌కార్డు ఆధారంగానే జరగనుంది. ప్రభుత్వం దీర్ఘకాల వ్యూహంతోనే ఈ గణనకు తెరతీసినట్లు తెలుస్తోంది. జిల్లాలో వయసుల వారీగా ఉన్న మానవ వనరుల లెక్క అధికారికంగా తేలడంతో పాటు నిరుద్యోగుల సంఖ్యపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఈ సర్వే ద్వారా కలుగుతోంది.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

- వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ కరుణాసాగర్
- ఉత్సాహంగా వర్సిటీ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణా సాగర్

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్యపోటీలు ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో క్రీడలు అంతర్భాగాలన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని, నిత్యం సాధన చేయాలని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన మౌలిక అవసరాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామన్నారు. విద్యార్థులు క్రీడలను తమ రోజువారి జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం అపురూపమైనదని, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్ ఎన్టీఆర్ కాలేజి ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం



- సూర్యలంక సముద్ర తీరం కిటకిట
- పౌర్ణమి కంటే ఎక్కువగా తరలివచ్చిన జనం
- 180 మంది పోలీసుల బందోబస్తు.. మరబోట్లు, డ్రోన్లతో గస్తీ

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరం పర్యాటకులు, భక్తులతో పోటెత్తింది. పవిత్ర కార్తీక మాసంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు బాపట్ల నుంచే కాకుండా దూరప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన భక్తుల పుణ్యస్నానాలతో సముద్రతీరం పులకరించింది. కార్తీక పౌర్ణమి రోజు కంటే ఎక్కువ మంది భక్తులు తరలిరావడంతో తీరం కిక్కిరిసిపోయింది. దీంతో 180 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్లతో, సముద్రజలాల్లో మరబోట్లపై గస్తీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరిస్తున్న వారిని లోతుకు వెళ్ళనీయకుండా అప్రమత్తం చేస్తూ మైక్‌లో పోలీసు సిబ్బంది సూచనలు చేశారు. అలల తాకిడికి కొట్టుకుపోతున్న వారిని కాపాడారు. డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు గంగాధర్, హరికృష్ణ, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసరావు, శ్రీనువాసులు, ఏఎస్ఐ అమరేశ్వరరావు తదితరులు భద్రతా ఏర్పాట్లలో పాల్గొన్నారు.



సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 18 నవంబరు 2024

దేనికైనా రెడీ..!



బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది. ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు... 'బిన్నీ అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్. వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది. తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు... అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.

అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్నీ' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్నీ' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్టుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లొకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, సైకో థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝున్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్

'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

కొత్తగా..

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగాస్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'నక్క పొడు పొడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.

మళ్లీ కలుద్దాం

● కేరింతలతో సందడి చేసిన బాలబాలికలు ● ముగిసిన వీవీఐటీ బాలోత్సవ్-2024





పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంబూరు లోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాలలో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్-2024 వేడుకలు ఆదివారంతో ముగిశాయి. కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుండి వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ వేడుకకు 25,000 మంది హాజరయ్యారు. 20 అంశాలు 61 విభాగాలుగా జరిగిన ఈ పోటీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతోపాటుగా రెండు ప్రత్యేక బహుమతులను పోటీదారులకు అందించారు. బాలల వికాసం, సంస్కృతీ సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంలో బాగంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలకు తొలి రోజు నుండి విశేష స్పందన లభించింది. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడవరోజున విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాల నడుమ వీవీఐటీ ప్రాంగణంలో కోలాహలంగా మారింది. జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించాయి. 52 బృందాలు 3 వేదికల వద్ద జాతర వాతావరణాన్ని సృష్టించాయి. 36 శాస్త్రీయ నృత్య బృందాలు రెండు వేదికలపై ఉత్సాహంగా సాగాయి. విచిత్ర వేషధారణ పోటీలలో పాల్గొన్న చిన్నారులు విశేషంగా ఆకర్షించారు. వారు ప్రదర్శించిన ప్రదర్శనలు తెలుగు కళలను సాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉన్నాయి. మట్టితో బొమ్మలు, కాగితపు చేతి బొమ్మలు అంశాలలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొని ఆయా ఆకృతులను రూపొందించారు. సమాజానికి హితవు పలికేలా వారి ప్రదర్శనలు ఉన్నాయి.







గుంటూరు ఘనతలో వీవీఐటీ కూడా

నాగార్జున సిమెంట్స్ గ్రూప్ ఈడీ వాసిరెడ్డి విక్రాంత్

గుంటూరు ఘనతలో వీవీఐటీ కూడా చేరుతుందని ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగార్జున సిమెంట్స్ గ్రూప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసిరెడ్డి విక్రాంత్ అన్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఘనత తెలుపుతూ ఆయన పాడిన పద్యం ఆకట్టుకుంది.విక్రాంత్ మాట్లాడుతూ భాషసాహిత్యంపై పట్టు ఉంటే జీవితంలో విజయం సులువు అని తెలిపారు. వైవిధ్యం గల సంస్కృతి, భాషా మన సొంతం అని వాటిని పరి రక్షించుకోవాలని అన్నారు. కళలతో ఆనందంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తాను నమ్ముతానని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీకి కూడా సృజనాత్మకత అవసరమని అన్నారు. సృజనాత్మక, నాయకత్వం లాంటివి కళలలో ఉంటాయని తెలిపారు.

ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వాలి

● అసెంబ్లీకి వస్తే కడిగేస్తాం ● నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే జూలకంటి



రెంటచింతల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వాలని, ఒకళ్లు ఇస్తే వచ్చేది కాదంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నిప్పులు చెరిగారు. రెంటచింతలలోని టీడీపీ సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రశ్నిస్తే సంకెళ్లు, ఎదురు తిరిగితే జైళ్లు, రాజ్యాంగ వ్యతిరేక,చట్ట వ్యతిరేక,ప్రజావ్యతిరేక నిర్ణయాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు పాతరేశారని విమర్శించారు. దళితులు,బీసీలు,మైనార్టీ,మహిళలకు నిద్ర కరువయ్యేలా చేశారని, రాక్షసులే నయం అనుకునేలా వ్యవహరించిన జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరైతే కడిగిపారేస్తామంటూ మండిపడ్డారు. 11 ఎమ్మెల్యే సీట్లకు ప్రతిపక్షహోదా రాదని తెలిసినప్పటికి ఏదో ఒరగబెడదామంటూ అధికార పక్షం అడ్డు తగులుతోందంటూ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష హోదా లేకపోతే అసెంబ్లీకి వెళ్లనని చెప్పిన ఏకైక మాజీ సీం జగనేనని ఎద్దేవా చేశారు. వంది మాగధులతో నాడు అసెంబ్లీలో మహిళలను కించపరిచేలా ప్రోత్సహించిన జగన్ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు హాజరైతే ఆయన బండారాన్ని బయటపెడతారనే భయంతో తప్పించుకుంటున్నారని విమర్శించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రాణాలు తీసేందుకు యత్నించిన జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. పౌరహక్కులను కాలరాసిన వైసీపీకి ఓటర్లు గుణపాఠం చెప్పినా జగన్ ప్రవర్తనలో మార్పు రాలేదని దుయ్యబట్టారు. టీడీపీకి చెందిన ప్రతి ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టి జైళ్ల పాలు చేశారని, ఆ బాధితుల్లో తానూ కూడా ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయండి : యూటీఎఫ్

బాపట్లనవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను స్వాగతిస్తున్నామని, అదే సందర్భంలో బేసిక్ పాఠశాలలో కూడా 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగాలని కోరారు. రాష్ట్రంలో 12 వేల పైచిలుకు ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు ఉండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. అపార్, యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దని, బో ధన కార్యక్రమాలకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. బధిరుల చట్టం తీసుకురావడానికి జరుగుతున్న చర్యలను యూటీఎఫ్ స్వాగతిస్తుందని అన్నారు. ఒక నిర్దిష్టమైన సమయంలోనే బదిలీలు జరపాలని, ప్రమోషన్ వ్యవస్థను ఒక సరైన మార్గంలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులు పీఎఫ్ ఖాతాలు ప్రారంభించాలని, ఆ ఖాతాలలో జమ అయిన సొమ్ముకు జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకిచ్చే రకంగా వడ్డీని కూడా చెల్లించేవిధంగా తగు ఉత్తర్వులివ్వాలని కోరారు. కార్యక్ర మంలో జిల్లా నాయకులు ఎస్.పాపారావు, ఎం.వెంకటేశ్వర రెడ్డి, యు.చెంచయ్య, కె.రవిబాబు, బి.వినోద్‌కుమార్, పి.రామాంజనేయులు, కెవిఎస్ఎన్ కోటేశ్వరావు, రాష్ట్ర కౌన్సిలర్లు పి.సురేష్, జె.బాబురావు,వలిఖాన్, హబీబ్, సీతారామరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

పాఠశాలల బలోపేతం బాధ్యత ఉపాధ్యాయులదే

● ఎమ్మెల్సీ అశోక్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు

గుంటూరు(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్సీ జేఏసీ మాజీ చైర్మన్ పీ అశోక్‌బాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని జలగం రామారావు మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్,ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ హైమారావు మాట్లాడుతూ జీవోనం 84 రద్దు చేసి నగరంలో అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు గ్రేడ్- హెచ్‌ఎంలు, అన్ని పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్స్ అవసరమనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో 'గౌడ' కీలకం : మంత్రి అనగాని



వేదికపై మంత్రి అనగాని, సినీనటుడు సుమన్, కొనకళ్ల నారాయణ తదితరులు

తాడేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో గౌడ జాతి కీలకమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని ఇప్పటంలో మండల గౌడ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి, సినీ నటుడు సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'గౌడ' అంటే వెనుకబడిన వర్గంగా కాకుండా రాష్ట్రంలో అభివృద్ధిని కాంక్షించే పెద్ద కులమని అన్నారు. గతంలో సర్దార్ పాపారాయుడు పౌరుషం, సర్దార్ గౌతు లచ్చన్న ధైర్యంతో గౌడ కులం ముందుకొచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో గౌడల మరింత అభ్యున్నతితో ముందుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. సుమన్ మాట్లాడుతూ ఆత్మీయత, ఐక్యతకు ప్రతీక వనసమారాధన అని అన్నారు. భవిష్యత్ తరాలకు మేలు చేకూర్చే వృక్షజాతిని సంరక్షిం చాలనే నిగూఢ సందేశాన్ని వనసమారాధన ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, డాక్టర్ పలగాని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఈవి నారాయణ, తాడేపల్లి మండల గౌడ సంఘం నాయకులు కంచర్ల కాశయ్య, లచ్చి తులసీదాస్, పలగాని నాగబాబు, ఐఎఫ్ఎస్ అధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.

పెదకాకాని మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మూడో ఆదివారం సందర్భంగా పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేకువజాము నుంచే భక్తుల సందడి నెలకొంది. కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించిన భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో త్వరిత గతిన దర్శనము చేసుకున్న భక్తులు స్వామి వారికి అభిషేకాలు జరిపించారు. పొంగళ్లను నివేదించారు ఆలయ ప్రాంగణంలో మేళతాళాల నడుమ ప్రభలతో మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, మంచినీళ్ల బాటిల్స్ అందించారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవా రుసుములు, ప్రసాదం విక్రయము, అన్నప్రసాద విరాళాల ద్వారా రూ. 6,50,000 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సౌత్ ఇండియా పోటీలకు 13 మంది లిఫ్టర్లు

మంగళగిరి సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరుగనున్న సౌత్ ఇండియా ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా నుంచి 13 మంది లిఫ్టర్లు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల సబ్‌జూనియర్స్‌లో శ్రావణి (43 కిలోలు), లక్ష్మీ వినయశ్రీ (84 కిలోలు), జూనియర్స్‌లో ఎం.షానూన్ (47 కిలోలు), ఎస్‌కే షబీనా (84 కిలోలు), చాతుర్య (76 కిలోలు), సీనియర్స్‌లో బి.చంద్రిక (76 కిలోలు), పురుషుల సబ్స్ జూనియర్స్‌లో హేమవర్ధన్ (74 కిలోలు), నాగగణేష్ (93 కిలోలు), జూనియర్స్‌లో రమేష్‌శర్మ (76 కిలోలు), పృథ్వీ (105 కిలోలు), ఎస్ కౌశిక్ (93 కిలోలు), భరత్‌కుమార్ (59 కిలోలు) ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్య నారాయణ, సౌత్‌ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు అభినందించారు.



ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

విజయవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారుకు బస్సు అడ్డం వచ్చిందని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో గొడవపడి దాడిచేసిన వ్యక్తులపై ఆదివారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లకు చెందిన కోటేశ్వరరావు తెనాలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెనాలిలో ప్రయాణికులను ఎక్కించుకుని విజయవాడ బయలుదేరాడు. విజయవాడ బస్‌స్టేషన్‌లోకి వెళుతుండగా దుర్గమ్మ గుడివైపు నుంచి అతి వేగంగా వచ్చిన ఇన్నోవా కారు బస్సును ఢీకొట్టబోయింది. కారులో ఉన్న డ్రైవర్, మరో ఐదుగురు కారులో నుంచి దిగి బస్సును అడ్డుకుని, డ్రైవర్ కోటేశ్వరరావుతో గొడవపడ్డారు. అనంతరం డ్రైవర్‌పై దాడి చేశారు. స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బస్సు డ్రైవర్ కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. దాడి చేసిన వారి వివరాలు తెలియరాలేదు. కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిలో కొందరు మద్యం తాగి ఉన్నట్లు సమాచారం.

విద్యార్థినులకు అస్వస్థత

మాత్రలు మింగి స్పృహ తప్పిన వైనం.. గుంటూరుకు తరలింపు

సత్తెనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాత్రలు మింగి విద్యార్థినిలు అస్వస్థతకు గురైన సంఘటన పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల సంక్షేమ వసతి గృహంలో ఆదివారం రాత్రి జరిగింది. వసతి గృహంలో ఇంటర్ చదువుతున్న సనిత, అఖిల అనే ఇద్దరు విద్యార్థినులు అధిక మొత్తంలో డోలో - 650 మాత్రలు మింగి అశ్వస్థతకు గురయ్యారు. హాస్టల్ సంక్షేమ అధికారి రాణెమ్మ వారిని ఏరియా వైద్యశాలకు తరలించగా, వైద్యులు చికిత్సనందిస్తున్నారు. పోలీసులు సమాచారం అందించిన అనంతరం ఆ విద్యార్థినులను మెరుగైన వైద్యసేవల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆస్పత్రి వైద్య సిబ్బంది తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేయాలని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అన్నారు. ఆదివారం ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని మంత్రి మండలి తీర్మానంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 23న కర్నూల్లో బీసీ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల శంఖారావాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓబీసీ సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర ఇన్‌చార్జ్ వై నూకాలమ్మలను సత్కరించారు. సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు, కలిశెట్టి లక్ష్మణరావు, భాను ప్రకాష్, ప్రవీణ్, గడ్డం శంకర్ యాదవ్, అంకాల శ్రీనివాసరావు, నిర్మల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాది ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బార్ కౌన్సిల్ సభ్యురాలు, తెనాలి కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న కాకుమాను కిరణ్మయి (37) శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై భర్త గిరిధరరావు ఆదివారం ఉదయం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక కొత్తపేటలో నివాసం ఉండే న్యాయవాది కిరణ్మయి ఇటీవల జరిగిన న్యాయమూర్తుల నియామక పరీక్షల్లో అరు మార్కులు తేడాతో ఫెయిల్ అయింది. కొంతకాలం క్రితం టైఫాయిడ్ జ్వరంతో అనారోగ్యానికి గురైంది. దీంతో మానసికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నటు తెలిపారు. ఆమెకు ఇద్దరు సంతానం. పదిహేడేళ్ల కుమారుడు సాత్విన్, ఏడేళ్ల వయసు ఉన్న కుమార్తె నిహారిక ఉన్నారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం నాటికి 585.00 అడుగులు ఉంది. ఇది 297.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,900 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 18,110 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 18,110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఫ్లోర్‌బాల్ పోటీలో గుంటూరు ప్రథమం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చిలకలూరి పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్ 12, 17 బాల బాలికల ఫ్లోర్ బాల్ పోటీలలో అండర్ 17 బాలికల విభాగంలో గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. బాలుర విభాగంలో కృష్ణా ప్రథమ స్థానం, బాపట్ల ద్వితీయ స్థానం, కడప జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం జరిగిన ఈ పోటీలలో 10 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. కాగా, అండర్ 12 బాలుర విభాగంలో బాపట్ల, కడప, ఎన్టీఆర్ జిల్లాల జట్లు, బాలికల విభాగంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. విజేతలకు చిలకలూరిపేట రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, కోశాధికారి కటకం శివరామ ప్రసాద్, చిలకలూరిపేట ప్రైవేట్ స్కూల్స్ సంఘం అధ్యక్షుడు వీరాస్వామి, డాక్టర్ సతీష్ బహుమతులను అందజేశారు.

కుడి కాలువలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

● ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి వెళ్లిన 'న్యూటన్స్' విద్యార్థి
● పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వాసి



మౌనేష్ (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కుడికాలువలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతైన సంఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన మౌనేష్ (18) పట్టణ శివారులోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక విష్ణుప్రియ లాడ్జి వద్ద గల ఓ గదిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన ముగ్గురు స్నేహితులతో కలిసి పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువకు ఈత కొట్టేందుకు వెళ్లారు. మౌనేష్ మెట్ల వద్ద ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడటంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రభాకరరావు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. గజ ఈతగాళ్లతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు శ్రీధర్ మృతి



డాక్టర్ కిష్టంశెట్టి శ్రీధర్ (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక సౌజన్య హాస్పిటల్ వైద్యులు కిష్టంశెట్టి శ్రీధర్ మృతి చెందారు. దాచేపల్లి నుంచి కారులో ప్రయాణిస్తున్న శ్రీధర్ స్థానిక సూర్యసెమ్ సమీపంలోకి రాగానే ముందుగా వెళ్తున్న లారీ రోడ్డు మార్జిన్ దిగే క్రమంలో కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీధర్ భౌతిక కాయాన్ని పట్టణంలోని వైద్యులు సందర్శించి నివాళులర్పించారు.

సోషల్ మీడియా కన్వీనర్ అరెస్టు

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పులిచర్ల సురేష్‌రెడ్డిపై కేసు నమోదైనట్లు పిడుగురాళ్ల సీఐ ఎస్ వెంకటరావు తెలిపారు. ఓ మహిళ ఫిర్యాదుతో పిడుగురాళ్లకు చెందిన పులిచర్ల సురేష్‌రెడ్డిని శనివారం రాత్రి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీడీవోను దూషించిన వైసీపీ నేత అరెస్టు

నాదెండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్లకి చెందిన వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డిని ఆదివారం అరెస్టు చేశారు. మండల పరిషత్ స్థలంలో జరిపిన అక్రమ నిర్మాణాలపై గత శుక్రవారం ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి విచారణ జరుపుతుండగా ఆమె విధులను ఆయన అడ్డగించారని, కులం పేరుతో దుర్భాషలాడాడని పోలీసులకు ఎంపీడీవో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ సుబ్బనాయుడు చిరుమామిళ్లకి ఆదివారం ఉదయం వెళ్లి విచారణ జరిపారు. ఈ క్రమంలో కోటిరెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి అరెస్టు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

మున్సిపల్, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించి వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని 18వ తేదీ నుంచి అన్ని మున్సిపల్ కార్యాలయాలలో, మండల కార్యాలయాలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి వారి సమస్యలను సమీప మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలకు వెళ్ళి దరఖాస్తులు సమర్పించుకోవచ్చు అన్నారు. రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

రేపు అంతర్ జిల్లాల కబడ్డీ సెలక్షన్స్

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్ జిల్లాల కబడ్డీ క్రీడాకారుల ఎంపిక మంగళవారం ఉదయం 11 గంటలకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మంతెన సుబ్బరాజు తెలిపారు. 71వ అంతర్ జిల్లాల కబడ్డీ సీనియర్ పురుషుల కబడ్డీ సెలక్షన్స్‌లో ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లా సంతమాగులూరులో డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాలకు పీడీ కత్తి శ్రీనివాసరావును 9346258841లో సంప్రదించాలన్నారు.

శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దీపోత్సవం

పిట్టలవానిపాలెం నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకరాజు నల్లిబోయనవారిపాలెంలోని శ్రీనివాసపురంలో ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి అఖండ కర్పూరహారతి వెలిగించి కార్తీక మాస దీపారాధన చేశారు. ఈ కార్తీమాసంలో దీపం చూసినా, వెలిగించినా విశేష ఫలితాలు కలుగుతాయని ఆలయ అర్చకులు బృందావనం గోపిచంద్ తెలిపారు. భక్తులు గ్రామంలోని అన్ని దేవాలయాలలో గోవింద నామస్మరణ చేస్తూ కర్పూరహారతిని సమర్పించారు. దేవాలయాలలో మహిళలు దీపారాధన చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోతార్లంకలో...

కొల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతార్లంకలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి భక్తులు లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మన్యసూక్త పూజ విధానంలో తమలపాకు పూజా దిపోత్సవం నిర్వహించారు. పూజాది కార్యక్రమాలను అర్చకులు మురళీ నిర్వహించగా, కార్య నిర్వహణాధికారి దీవి వెంకటప్పాలాచార్యులు పర్యవేక్షించారు.

విద్యార్థులకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలు

పిట్టలవానిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా శాఖా గ్రంథాలయాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం నాల్గవ రోజు విద్యార్థులతో డ్రాయింగ్, మ్యూజికల్స్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందోలు, పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, మంతెనవారిపాలెం శాఖా గ్రంథాలయాలకు చెందిన అధికారులు, పాఠకులు, పలువురు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి స్థలం కోసం వ్యక్తిగత అర్జీలు అందించండి : సీపీఐ

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇంటి స్థలాల కోసం ఈనెల 18వ తేదీన గ్రామీణ, పట్టణాలలో సచివాలయాల దగ్గర వ్యక్తిగత అర్జీలు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్ అధ్యక్షత వహించగా సింగరకొండ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేదలకు గ్రామాలలో మూడుసెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు చొప్పున స్థలాలిచ్చి ఇంటినిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, ముత్తిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ పోటీలకు 60 మంది స్త్రీ, పురుషులు హాజరయ్యారు. 30 సంవత్సరాలు నుంచి 75 సంవత్సరాల వయసు ఉన్నవారు 45 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 28, 29 తేదీలలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్ తెలిపారు.

అమిరినేని లక్ష్మయ్య సేవలు అభినందనీయం

రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యల కోసం నిరంతరం పోరాడి అండగా నిలిచిన వ్యక్తి అమిరినేని లక్ష్మయ్య అని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ అన్నారు. నల్లూరుపాలెంలో ఆదివారం లక్ష్మయ్య విగ్రహం వద్ద నిర్వహించిన సంతాపసభలో ఆయన చిత్రపటానికి పలువురు సీపీఎం నేతలు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమిరినేని బసవపున్నయ్య, నల్లూరుపాలెం కార్యదర్శి డి.బాబూరావు, సీపీఎం నేతలు కేవీ లక్ష్మణ్‌రావు, టి.ధర్మరాజు, కె.రమేష్, టి.ఆగస్టీన్‌పాల్గొన్నారు.

గన్‌పంతులు మృతి తీరని లోటు

పిట్టలవానిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేల మంది విద్యార్థులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దిన సయ్యద్ యాకుబ్ ఆలి (గన్ పంతులు) మృతి తీరనిలోటు అని పలువురు ప్రముఖులు అన్నారు. సయ్యద్ యాకుబ్ ఆలి అంత్యక్రియలు ఆదివారం ముస్లిం శ్మశాన వాటికలో నిర్వహించారు. ఆయన అకాల మరణంపై గ్రామస్థులు, కూటమి నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామీణ రహదారులకు మోక్షం ఎప్పుడో?

● కనీస మరమ్మతులు చేయాలని కోరుతున్న ప్రజలు



తెనాలి-అనంతవరం రహదారి గోతుల్లో నిలిచిన వర్షపు నీరు



ఆవులవారిపాలెం వద్ద రహదారిపై మోకాలి లోతు గోతులు

కొల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా దెబ్బతిన్న గ్రామీణ ప్రాంత రహదారులకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. దెబ్బతిన్న రహదారులు పునరుద్ధరణ సంగతి దేవుడెరుగు.. కనీస మరమ్మతులు అయిన చేయాలంటూ వేడుకుంటున్నారు. కొల్లూరు మండల పరిధిలోని చిలుమూరు నుంచి తెనాలి వెళ్లే ప్రధాన రహదారి పూర్తి గోతుల మయంగా మారి ప్రయాణికులకు అసౌకర్యంతో పాటు ప్రమాదభరితంగా తయారైంది. అలాగే కొల్లూరు కరకట్ట నుంచి కొత్తూరులంక వెళ్లే రహదారి సైతం అరవింద వారధి వరకు పూర్తిగా పాడైపోయింది. ఇటీవల వరదల సమయంలో మరింతగా కోతకు గురై వరద ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయింది. ముఖ్యమంత్రి పర్యటిస్తారని సమాచారం రావడంతో కలెక్టర్ ఆ రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించినప్పటికీ మళ్లీ కురిసిన వర్షాల వల్ల ఆ రహదారి యధాస్థితికి చేరుకుంది.

ఈ రహదారిపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైగాయపడిన సంఘటనలు కొకొల్లలు. దోనేపూడి కరకట్ట నుంచి పోతార్లంకకు వెళ్లే రహదారి, తెనాలి ప్రధాన మార్గం నుంచి రావికంపాడు వెళ్లే రహదారులు సైతం దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోలేదు. కొల్లూరు మండల, గ్రామాల స్థాయి నాయకులు తమ పరిధిలో దెబ్బతిన్న రహదారుల దుస్థితిని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు వివరించి రహదారులకు మరమ్మతులైన చేయించాలని కోరుతున్నారు.

అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జి.కరుణా సాగర్



వాలీబాల్ పోటీలలో తలపడుతున్న క్రీడాకారులు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో 2024-2025 వ్యవసాయ విశ్వవిద్యాలయం వార్షిక 2వ దశ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణా సాగర్ ఆయా కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వాలీబాల్ పోటీలలో గుంటూరు సీసీఎస్, ఉదయగిరి ఎస్ఎంజీఆర్ జట్లు, అనంతపూర్ ఎస్‌కేడీతో బద్వేల్ ఎస్‌బీవీఆర్ కళాశాల జట్లు తలపడ్డాయి. ఈ పోటీలలో గుంటూరు సీసీఎస్, అనంతపూర్ ఎస్‌కేడీ జట్లు విజేతలుగా నిలిచాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో నైరా అగ్రికల్చర్ కాలేజితో సిఎస్‌పురం కెబిఆర్ కళాశాల జట్లు, బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టుతో బాపట్ల ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల జట్టు తలపడ్డాయి. ఈ పోటీలలో నైరా వ్యవసాయ కళాశాల జట్లు, బాపట్ల వ్యవసాయ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయి. టెన్నీకాయిట్ పోటీలలో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల, మడకసిర సీఏఈ కళాశాల, ఎచర్ల ఎస్‌కెవై, నైరా వ్యవసాయ కళాశాల క్రీడాకారులు తలపడ్డారు.

ఈ పోటీలలో మడకసిర సీఏఈ, నైరా వ్యవసాయ కళాశాల క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. వాలాబాల్ పోటీలలో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టుపై తిరుపతి వ్యవసాయ కళాశాల జట్టు, సిఎస్‌పురం కెబిఆర్ కాలేజి జట్టుపై నైరా వ్యవసాయ కళాశాల జట్టు, ఎన్ఎస్ మార్కాపురం జట్టుపై పులివెందుల సిఎఫ్ఎస్‌టి జట్టు, తిరుపతి జేసీడీఆర్ జట్టుపై మహానంది వ్యవసాయ కళాశాల జట్టు తలపడ్డాయి. ఆయా పోటీలలో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టు, నైరా వ్యవసాయ కళాశాల జట్టు, ఎన్ఎస్ మార్కాపురం, మహానంది వ్యవసాయ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయి.

వనసమారాధనలు ఐక్యమత్యాన్ని చాటుతాయి

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమారాధన కార్యక్రమాలు ఐకమత్యాన్ని చాటుతాయని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. చదలవాడలో ఉన్న హరిహర క్షేత్ర ప్రాంగణంలో దేవాదాయ శాఖ, గ్రామస్తులు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన వన సమారాధన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆనందబాబు హాజరయారు. ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో అందరితో కలిసి ఆనందబాబు భోజనం చేశారు. చదలవాడ, కాకర్లమూడి, కుచ్చెళ్లపాడు గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...



కార్యక్రమంలో పాల్గొన్న శివప్రసాద్ తదితరులు

రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, ఎంఆర్‌కే మూర్తి, సంఘం నాయకులు పాల్గొన్నారు. రేపల్లె పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనగాని శివప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు.

పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో...



సభలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆడిట్ అండ్ ఫైనాన్షియల్ కంట్రోలర్ జేడీ అందే వెంకటేశ్వరరావు

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంఘీయులంతా సమైక్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆడిట్ అండ్ ఫైనాన్షియల్ కంట్రోలర్ జాయింట్ డైరెక్టర్ అందే వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ కూడలిలోని పద్మశాలి సేవాసంఘ భవనంలో బాపట్ల-కర్లపాలెం పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు పోసా ఏడుకొండలు అధ్యక్షత వహించారు. స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా మాట్లాడుతూ మహిళలంత బాగా చదువుకోవాలని, ఆర్థికంగా బలపడాలని తెలిపారు. క్రమశిక్షణతో నడుచుకుంటే పదవులు వాటింతట అవే వస్తాయని పగడ వెంకటశేషనాగశయనం తెలిపారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో గోలి రవికాంత్, ఆకురాతి సత్యనారాయణ, భట్టు రవీంద్రనాద్, తేలప్రోలు వాసుదేవమూర్తి, భట్టు శ్రీనివాసరావు, గుంటి జగన్మోహనరావు, పులిమి వెంకటేశ్వరరావు, పడవల సరేంద్రనాద్, ఎవిఎన్ మూర్తి, శ్రీహరి, గోలి అరుణకుమారి, భారతి, రాజ్యలక్ష్మి, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

మహర్షి ఆశ్రమ గోశాలలో...

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహర్షి ఆశ్రమ గోశాలలో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం సప్త గోపూజ, మహారుద్రాభిషేకం, శ్రీలక్ష్మీగణపతి హోమం, నవనాగసహిత మానసాదేవికి విశిష్ట కుంకుమార్చన చేశారు. వేద విద్యార్థులతో వేదపారాయణ అమ్మపేరుతో ఒక మొక్క అనంతరం మహాప్రసాదవితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ శ్రీరామ పారాయణ సేవాసమితి నిర్వాహకులు నిభానుపూడి జానకిదేవి, సునీత, కల్పన, బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు హరిప్రకాష్, శ్రీసంపత్ గణపతిపరివార్ సభ్యులు బి.బాబునాగేంద్ర, మామిడి రాజశేఖర్, హరినారాయణ, మామిడి పద్మావతి, భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, అనురాధ, మామిడి గంగాభవానీ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయసేవా సమితి ఆధ్వర్యంలో

అమృతలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నియోజకవర్గ పరిధిలో కాపు సామాజిక వర్గం రెండవ వన సమారాధన నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయసేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు జంపని షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ దాది సూరయ్య మాట్లాడుతూ కాపు సామాజిక వర్గం ఎటు వైపు ఉంటే ఆ పార్టీకి అధికారం తథ్యం అన్నారు. ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ చందు విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలపై శ్రద్ధ వహించి వారు విద్యలో రాణించేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఆర్థోపెడిక్ సర్జన్ కమ్మెల హరీష్, జనసేన అధికార ప్రతినిధి కన్నా రజని, జాతీయ కాపు సంఘం అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు, బండారు హుస్సేన్, రామదాసు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అతిథులను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు.

సముద్రస్నానానికి తరలివెళ్ళిన భక్తులు

కర్లపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల నలుమూలల నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, కార్లు తదితర వాహనాలలో వందలాదిమంది భక్తులు కార్తీక మాస పుణ్యస్నానాలను ఆచరించేందుకు ఆదివారం సూర్యలంక సముద్రానికి తరలివెళ్ళారు. భక్తులందరు భోజన ఏర్పాట్లు చేసుకొని పుణ్యస్నానాలను ఆచరించేందుకు కుటుంబ సమేతంగా తరలివెళ్లి సముద్రవేణికి పూజలు చేసి సముద్రంలో పుష్పఫలాలు సమర్పించి ప్రమిదలు, దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పుణ్యస్నానాలను ఆచరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానవిలువలు పెంపొందుతాయి

● ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న వంకదారి సుబ్బరత్నమ్మ

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో విజ్ఞాన విలువలు పెంపొందుతాయని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం బాపట్ల శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కవిసమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే పుస్తక పఠనం అనేది తప్పనిసరి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అంగలకుదురు శివాజి గణేశన్, డాక్టర్ శ్రీనివాసరావు, కె.శ్రీరామచంద్రమూర్తిరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం కవులను సత్కరించారు.

శ్రీ బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న కృష్ణస్వామి గురూజి



కృష్ణస్వామి గురూజిని సత్కరిస్తున్న ఆలయ వేదపండితులు

పిట్టలవానిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని ఆదివారం సాయంత్రం తిరుపతి భువనేశ్వరి పీఠాధిపతులు కృష్ణస్వామి గురూజి, బాపట్ల అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ దర్శించుకున్నారు. తొలుత ఆలయ పండితులు వారికి స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ విశిష్టతలు గురించి గురూజి అడిగి తెలుసుకున్నారు. పండితులు వేద ఆశీర్వచనం, అమ్మవారి శ్వేత వస్త్రాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గ్రామ దేవతలకు వెండికుందులు సమర్పణ



వెండి కుందులు సమర్పిస్తున్న భక్తులు

కొల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతలకు వెండికుందులను భక్తులు సమర్పించారు. కొల్లూరులోని చింతలమ్మ, అంకమ్మ తల్లి ఆలయాలలోని అమ్మవార్లకు ఆదివారం కొల్లూరుకు చెందిన రావినూతల సూర్యనారాయణ ప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన 1100 గ్రాముల వెండి కుందులను ఆలయ అర్చకులకు సమర్పించారు. ఈ విషయాన్ని ఆలయ కార్య నిర్వహణాధికారి నాగసత్యశ్రీనివాసరావు తెలిపారు

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

రేపల్లె, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం పడి పూజా కార్యక్రమం ఘనంగా వేదమంత్రాలతో నిర్వహించారు. హరిహరసుతుడు అయ్యప్పస్వామికి పంచామృతాల అభిషేకం కమిటీ సభ్యులైన తలసల శ్రీనివాసరావు,కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సత్యనారాయణ గురుస్వామి పూజలు చేశారు. అనంతరం 500 మంది అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు, అయ్యప్ప స్వాములు, దుర్గాభవానీలు, భక్తులు పాల్గొన్నారు.

ముప్పలనేని వర్ధంతి సందర్భంగా కంటి వైద్య శిబిరం



కంటి వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముప్పలనేని శేషగిరిరావు 5వ వర్ధంతి సందర్భంగా బాపట్ల రోటరీ కమ్యూనిటి హాలులో ఆదివారం ముప్పలనేని చారిటబుల్ ట్రస్ట్ బాపట్ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యపరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని, జిల్లా అంధత్వనివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాగేశ్వరరావు, హరిబాబు, సుబ్బారావు, ముప్పలనేని సుమంత్, నామభవ్యతేజ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలు ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్



ఎస్సీ వసతి గృహంలో వంట చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వసతి గృహాలను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి ఆదివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. బీసీ వసతిగృహం, ఎస్సీ బాలికల వసతిగృహం, బీసీ బాలుర వసతిగృహం, ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం పరిశీలించి వార్డెన్, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజన పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. మార్కెట్ వద్ద ఉన్న బాలికల వసతిగృహంలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. అనంతరం వివేకానందకాలనీలోని మున్సిపల్ పార్క్‌ను పరిశీలించి సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పెయింటర్స్ కాలనీలో మున్సిపల్ పార్క్‌ను పరిశీలించి పార్క్ సుందరీకరణకు కావాల్సిన అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, శ్రీనుబాబు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతి తీరని లోటు

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం ఒక ప్రకటన ద్వారా రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

● రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవలో పని చేసి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి రామ్మూర్తినాయుడు అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభి రామారావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు రేపల్లె సురేష్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, పరుచూరి విజయ్‌కుమార్, టి.సాయిబాబు, ఎం.రామకృష్ణపాల్గొన్నారు.

● బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రామ్మూర్తినాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మందపాటి ఆంద్రే య అన్నారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో ఆదివారం రామ్మూర్తినాయుడు పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పరీద్‌మస్తాన్, నాయకులు చేజర్ల సతీష్, కొల్లూరు వెంకట్రావు, చాప సోమయ్య, సూరగాని శేఖర్, దారా అశోక్, విన్నకోట వీరయ్యనాయుడు, పరిశా రమేష్‌గౌడ్, దొమ్మలపాటి రాఘవేంద్ర, పసుమర్తి యలమంద, కె.అశోక్, సుబ్బారావు, రమేష్, కాలేషా, షేక్.బాజి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ ఎంపీటీసీ

రేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకివారిపాలెం వైసీపీ ఎంపీటీసీ లుక్కా బాపనయ్య విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడని బాపట్ల ఏడీఈ ఆర్.మల్లికార్జునరావు ఆదివారం తెలిపారు. ఎలక్ట్రిసిటి సెక్షన్ 35 యాక్ట్ 2003 ప్రకారం అతనికి రూ.65,128లు జరిమానా విధించారు. దీంతోపాటు సూపర్‌వైజింగ్ చార్జీలు, కాంపౌండింగ్ ఫీజు రూ.5 వేలు అదనంగా జమ చేయాలని ఏడీఈ మల్లికార్జునరావు తెలిపారు.



బంగారు పతకం సాధించిన నాగరాజు, సాంబశివరావు (మధ్యలోఉన్నవారు)

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా

» బంగారు పతకం సాధించిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజు

» పరుగు పందెంలో సాంబశివరావుకు గోల్డ్‌మెడల్

చీరాలటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ 40 ప్లస్ విభాగంలో చీరాల టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు సత్తా చాటారు. షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్ సాధించారు. గత శుక్రవారం నుంచి ఆదివారం వరకు వెస్ట్ బెంగాల్‌లోని న్యూ కూచ్ బీహార్ స్టేడియంలో జరిగిన పోటీల్లో నాగరాజు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. అలాగే చీరాల మండల పరిధిలోని సిండికేట్ వీవర్స్ కాలనీకు చెందిన సివిలియన్ అడిగోపుల సాంబశివరావు 45 ప్లస్ విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెం విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. సుమారు 5 దేశాల నుంచి పోటీల్లో క్రీడాకారులు పాల్గొనగా, చీరాల ప్రాంతం నుంచి గర్వించదగేలా ఘనతను చాటిన ఇద్దరినీ పలువురు అభినందిస్తున్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

» ప్రత్యేక హారతులు, అన్నదాన కార్యక్రమాలు

బల్లికురవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో ఉన్న హనుమాన్ సాయి మందిర వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా దేవాలయానికి పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సాయికి అభిషేకాలు చేసి, హారతలిచ్చారు. కార్తీక మాసం కావడంతో బల్లికురవ, గుంటుపల్లి, కొత్తపాలెం, నాగరాజుపల్లి, అంబడిపూడి, కొండాయపాలెం, కొణిదెన, చెన్నుపల్లి, వల్లాపల్లి గ్రామాల నుంచి భక్తులు విరివిగా తరలి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్థులు, దేవాలయ కమిటీ సభ్యులు, సాయి సేవకులు వెంకటేశ్వర్‌రెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయినాథుని విగ్రహ గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోతే కేసులు

బల్లికురవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. ఆదివారం విజువల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాయపాలెం రోడ్డు వద్ద ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వాహనదారులతో అయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు, ఇన్సూరెన్స్ పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై చర్యలు తప్పవు అన్నారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి

అద్దంకిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు చూడాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు సమావేశాలకు రాకపోవడాన్ని కోటికలపూడి సర్పంచ్ విక్రమ్ ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. చక్రాయపాలెం సర్పంచ్ నగేష్ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు.

మేదరమెట్ల : ఐక్యతతో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. ఆదివారం కొరిశపాడు మండల పరిషత్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు గురించి అధికారులు వివరించారు. ఉపాధి నిధులతో జరుగుతున్న పనులు నాణ్యతతో చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణ, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అద్దంకిలో రెండు ఇళ్లలో చోరీ

» 38 సవర్ల బంగారం, రూ.54వేలు అపహరణ

» కుటుంబసభ్యులు నిద్రిస్తుండగానే దొంగతనం

» బెంబేలెత్తుతున్న ప్రజలు


విశ్వభారతి స్కూల్ సమీపంలో చోరీ జరిగిన ఇంట్లో చిందవందరగా ఉన్న బీరువా

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగానే రెండు ఇళ్లల్లో చోరీలు జరిగి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుల కథనం మేరకు పట్టణంలోని కాకానిపాలెం ఆర్టీసీ ఉద్యోగి నరిశేటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయిని కవిత దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా దొంగలు ఇంటి గొంది తలుపు గడియను కిటికీ గ్రిల్స్ లోగుండా తీసి ఇంట్లోకి ప్రవేశించారు. దంపతులు నిద్రిస్తున్న గదిలో ఉన్న సుమారు 18 సవర్ల బంగారం ఆభరణాలు, రూ.4వేల నగదును దొంగలు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత అపహరించుకుపోయారు. డూప్లెక్స్ ఇల్లు కావడంతో పై అంతస్తులో కూడా దొంగలు వెతికారు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. విశ్వభారతి కళాశాల సమీపంలో తిమ్మాయపాలెం హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.బాబూరావు, ఎన్నెస్పీ ఉద్యోగిని పద్మలత దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా దొంగలు వెనుక వాకిలిని కిటికీ లో గుండి తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. దంపతులు నివశిస్తున్న పక్క బెడ్ రూమ్‌లో బీరువాలు తెరిచి శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీకి పాల్పడ్డారు. సుమారు 20 సవర్ల బంగారం ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. నిద్రిస్తున్న బెడ్ రూమ్‌లోని బాబూరావు షర్ట్, ప్యాంట్‌లను పక్క బెడ్ రూమ్‌లోకి దొంగలు తీసుకు వచ్చి పడవేశారు. సమీపంలోని మరో ఇంట్లో కూడా చోరీకి ప్రయత్నం చేశారు. చోరీలు జరిగిన ఇళ్లను సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా ఆదివారం పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం ఆయా ఇళ్లల్లో దొంగల వేలిముద్రలను సేకరించారు. అయితే రెండు ఇళ్లల్లో చోరీలు జరిగిన తీరు ఒకే విధంగా ఉంది.

గత రెండు నెలలలో అద్దంకి పట్టణంలోని పలు ఇళ్లల్లో జరిగిన ఐదారు చోరీలు కూడా ఇదే తీరులో ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తుండగానే కిటికీలలో నుంచి తలుపు లోపల గడియలను తొలగించి చోరీలకు పాల్పడ్డారు. ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తుండగానే చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

చేసేదే చెప్తాం..చెప్పింది చేస్తాం

ఎమ్మెల్యే కొండయ్య


మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య తదితరులు

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా ప్రయోజనాలకు చెప్పింది చేద్దాం. చేసేది చెప్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తదితరులు ఉద్ఘాటించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్, చీరాల నియోజకవర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యులు డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్ సభా నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. వైసీపీ ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో కొనసాగుతున్న పాలనా తీరుకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలనతో ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలను వివరించారు. ముందుగా చీరాల మండలం ఈపురుపాలెం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు నాయకులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. సభకు ముందుగా మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

శస్త్ర చికిత్సకు 219 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు, హాజరైన ప్రజలు

యద్దనపూడి (మార్టూరు) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రీ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏలూరి ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భారీగా ప్రజలు హాజరయ్యారు. సుమారు 672 మంది ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 219 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరంగా గుర్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత టీడీపీ మండల నాయకులు ఎన్టీఆర్ విగ్రహంతో పాటు స్వర్గీయ ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు స్త్రీ, పురుషులకు వేరువేరుగా ఏర్పాటు చేసిన ఓపీ కౌంటర్ల వద్ద శంకర్ కంటి ఆస్పత్రి వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజా నాయకునిగా లక్ష మందికి కంటి ఆపరేషన్‌లు చేయించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారన్నారు. వైద్య శిబిరం అనంతరం వచ్చినవారందరికీ భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబు, రంగయ్యచౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, తారకరామారావు, రావిపాటి సీతయ్య, బోయపాటి సాంబశివరావు, ఈదల అనిల్, సింగు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు మంత్రి గొట్టిపాటి ప్రశంస

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును పూర్తి చేసిన గ్రామ నేతలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసించారు. నియోజకవర్గంలోని కుర్రావానిపాలెం, విప్పర్లవారిపాలెం, అద్దంకి పట్టణంలోని 176వ నెంబర్ బూత్‌ల నేతలకు వారికి కేటాయించిన సభ్యత్వాలను పూర్తి చేయడంతో గొట్టిపాటి ఫోన్ చేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించటం, గ్రామ, వార్డు లలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయడం మంచి పరిణామం అన్నారు.

కవి సమ్మేళనం

అద్దంకి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ, సృజన ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులకు హ్యాండ్‌రైటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. గ్రంథాలయానికి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ద్వారా దివాకర్‌దత్ హ్యాండ్‌మైక్ సెట్ స్పీకర్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుగుణరావు, డాక్టర్ దేవపాలన పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పంచేవి గ్రంథాలయాలు

చినగంజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : విజ్ఞానాన్ని అందించే పుస్తక భాండాగారాలు గ్రంథాలయాలని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు అన్నారు. ఆదివారం కవి సమ్మేళనం, రచయితల సందేశాల కార్యక్రమాలను నిర్వహించారు. కవులు చుండూరి వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరశాస్త్రిని గ్రంథపాలకులు మోహనల క్ష్మీనరసింహాచార్యులు, ఉపాధ్యాయులు, వాసవీ సభ్యులు సన్మానించారు. కవి వెంకటేశ్వర్లు రాసిన ప్రణయ సుందర దృశ్యం అనే పుస్తకాన్ని గ్రంథాలయానికి బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతురాజు, వై.రామాంజనేయులు, షేక్ నాయబ్ రసూల్, వనితా మండల అధ్యక్షురాలు సుచిత్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహనతో వైద్యం అందించాలి

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు కొత్త వ్యాధులపై అవగాహనతో వైద్యం అందించాలని గుంటూరు లైఫ్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ కొసరాజు కమలాకర్, డాక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. షాదీఖానాలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో వి.సుబ్బారావు, వలి, చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభ్యుదయభావాల గ్రామం గంగవరం



మాట్లాడుతున్న కృష్ణయ్య

ఇంకొల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో ఎక్కువ మంది అభ్యుదయభావాలు కలిగి, సేవాదృక్పథంతో సేవందించే వారు ఉన్నారని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య అన్నారు. ఆదివారం గంగవరంలో మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ కల్యాణ మండపంలో జరిగిన మంచాల రవి సంస్మరణసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంచాల వెంకట్రామయ్య కుమారులు డాక్టరు రమేష్ బాబు, రవి గ్రామానికి అందించిన సేవలను కొనియాడారు. రవి ధార అనే స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి అంతర్జాతీయంగా ఆయన మిత్ర బృందంతో పేదలకు సేవందించేలా ముందుకు సాగారన్నారు. గ్రామానికి సేవలందించిన పలువురు ప్రముఖుల గురించి ప్రస్తావించారు. ఆ నాడు వలేటి కుటుంబీకులు గ్రామంలో శ్రీవలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయడంతో ఎంతో మంది ప్రయోజకులయ్యారన్నారు. అనంతరం షుగర్ వ్యాధిగ్రస్తులకు గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక వారు వైద్య శిబిరం నిర్వహించి మందులను అందజేసారు. రైతు సంఘ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు రమాదేవి, ఏలూరి సిద్దయ్య, సీఐటీయూ రైతు సంఘం నాయకులు, కరి కమలేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


భవానీ సెంటర్‌లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

» చీరాల డీఎస్పీ మొయిన్

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చీరాల డీఎస్పీ మొయిన్ అన్నారు. అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న నేపథ్యంలో ఆదివారం పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మరలా స్థానికులు ఇతర వర్గాల ప్రజలతో చర్చించి ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల గురించి అధికారులతో చర్చించారు. మండలంలోని ధర్మవరంలో కొనసాగుతున్న పికెట్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. వర్గ విభేదాలు ఉన్న గ్రామాలపై పోలీస్‌లు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య ఎస్సైలు ఖాదర్‌బాషా, ప్రవీణ ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి

చీరాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నిర్దిష్ట కార్యాచరణతో పనిచేస్తామని ఏరియా వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో అన్నీ సమకూర్చితే ప్రైవేటు కన్నా మిన్న అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై డాక్టర్ సుభాషిణి స్పందించారు. వైద్యశాలలో ఐదు విభాగాలకు వైద్యుల కొరత ఉందన్నారు. ఎముకలు, కీళ్లు, సీఎస్ ఆర్ఎంవో, పీఎస్ఎస్ జనరల్ వైద్యుల పోస్టులు, కంటి వైద్యనిపుణులు, చెవి, ముక్కు, గొంతు వైద్యులు ఉపనియామకమై ఉన్నారు. ఈ ఐదు పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. 100 పడకల ఆసుపత్రిలో 12 మంది భద్రతా సిబ్బంది, 23 మంది పారిశుద్య కార్మికులు మాత్రమే ఉన్నారు. రోగులకు అనుగుణంగా ఈ సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. పోస్టుమార్టంకు డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మహాప్రస్థాన వాహనాల పునరుద్ధరణకు కమిషనర్‌కు నివేదించినట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తెలిపారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

చీరాలటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ అధికారులు మండల పరిధిలో ఆదివారం దాడులు నిర్వహించారు. బుర్లవారిపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 12 సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్‌నకు యత్నం

» వెంబడించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చినగంజాం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి కిడ్నాప్ యత్నాన్ని పోలీసులు అడ్డుకున్న సంఘటన చినగంజాం పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని మున్నంవారిపాలెం పంచాయతీ బేతాళవారిపాలెం గ్రామానికి చెందిన పిల్లి వెంకటకృష్ణారావు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఎనలిస్టుగా ఉంటూ ఫేస్‌బుక్‌ల్లో లింకులు ఇస్తూ కమీషన్ పొందుతూ ఉంటాడు. పదిరోజుల కిందట హైదరాబాద్‌కు చెందిన రియాజ్ అనే అతను రాజేశ్వరి అనే పేరుతో ఉన్న ఫేస్‌బుక్ నుంచి వెంకటకృష్ణారావుకి హాయ్ చెప్పారు. నేను కూడా ట్రేడింగ్ చేయాలనుకుంటున్నాను, నాదగ్గర యూఎస్ డాలర్స్ ఉన్నాయని మెసేజ్ పుంపాడు. సరే చేయండని కృష్ణారావు రియాజ్‌కి లింక్ పంపాడు. ఆ లింకు మీద రెండు రోజులు ట్రేడింగ్ ఎలా చేయాలనే దాని మీద ఆన్‌లైన్‌లో రియాజ్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 12వ తేదీన వెంకటకృష్ణారావు ఫోన్ చేసి నా యూఎస్ డాలర్స్ నీకు పంపిచాను చూడు అని రియాజ్‌కు చెప్పారు. అది నేను స్క్రీన్‌షాట్ చేసి చూస్తానని రియాజ్ చెప్పి, వెంకటకృష్ణారావు చూసేసరికి ఆ స్క్రీన్ షాట్ డిలీట్ చేయడంతో దానిని ఎందుకు డిలీట్ చేసావని రియాజ్‌ని వెంకటకృష్ణారావు అడగగా, రియాజ్ డాలర్స్ మిస్ అయ్యాను దానికి నువ్వేకారణమని మాట్లాడాడు. ఈ క్రమంలో రియాజ్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు వ్యక్తులను రెండు కార్లలో పంపించి వెంకటకృష్ణారావుని తీసుకుని రమ్మని చెప్పగా వాళ్ల ఆదివారం ఉదయం మున్నంవారిపాలెం వచ్చి వెంకటకృష్ణారావును కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. బాధితుడి బావ హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంటనే వారిని వెంబడించి పిడుగురాళ్ల సమీపంలో ఇద్దరిని, రాష్ట్ర సరిహద్దులో నలుగురిని పట్టుకున్నారు. శ్రీపాద కిరణ్ (హైదరాబాద్, బోడుప్పల్) గుర్రం ఆనంద్‌కుమార్, ఉప్పల్, కరెంట్ కోటి కల్కి, చంగిచర్ల, నాగం నరేందర్, బోడుప్పల్, బూడారం లక్ష్మారెడ్డి, ఉప్పల్, జేసాయికుమార్, ఉప్పల్ అదుపులో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కార్తీక వనసమారాధనలు

పెద్దఎత్తున పాల్గొన్న ఆర్యవైశ్య, బ్రాహ్మణ కుటుంబాలు


బ్రాహ్మణ కార్తీక సమారాధనలో ప్రసంగిస్తున్న లక్ష్మీనారాయణ

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక వనసమారాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శింగరకొండలోని ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రంలో ఆదివారం ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ సుబ్బారావు దంపతులు, గునుపూడి నవీన్ ఆధ్వర్యంలో రమా సత్యనారాయణ స్వామి వ్రతం, విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. అనంతరం వనభోజనాలు చేశారు. కమిటీ అధ్యక్షుడు శ్రీరాం నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించారు. చందలూరు మహాలక్ష్మి అమ్మవారి పీఠం నిర్వాహకులు కోట లక్ష్మీనారాయణ కార్తీక మాస విశిష్టత ను వివరించారు. ఆరామ క్షేత్రం విరాళం దాతలను ఘనంగా సన్మానించారు. జమ్మలమడక హనుమంతరావు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, వామరాజు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, శివప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడుకు నివాళులర్పించిన బలరాం


నివాళి కార్యక్రమంలో పాల్గొన్న బలరాం

చీరాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు సోదరుడు మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు మృతికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆదివారం చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో రామ్మూర్తినాయుడు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ సీనియర్ నేత కరణం బలరాంకు నమస్కరిస్తూ పలకరించారు. సీఎం చంద్రబాబు, కరణం బలరాం మధ్య కొద్దిపాటి సంభాషణ జరిగింది.

సోషల్ మాధ్యమాలపై పోలీసుల దృష్టి

చీరాలటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా, వాట్సాప్ వంటి సోషల్ మాధ్యమాలపై చీరాల పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు అప్రమత్తమయ్యారు. ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించే విధంగా వచ్చే ప్రేరేపిత పోస్టులపై విధిగా దృష్టి సారిస్తున్నారు.